
# సాక్షి గుంటూరు

ఆదివారం । 16 । ఫిబ్రవరి । 2025




## రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

వేటపాలెం: అనుమతులు లేకుండా పందిళ్లపల్లి వైపు నుంచి బైపాస్ మీదుగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్టేషన్‌కి తరలించినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు.



## సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 539.70 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 9,500 క్యూసెక్కులు విడుదలవుతోంది.

## అభయాంజనేయ స్వామి వార్షిక మహోత్సవం



చాగంటివారిపాలెం (ముప్పాళ్ళ): సత్తెనపల్లి-నరసరావుపేట ప్రధాన రహదారిపై చాగంటివారి పాలెం గ్రామం వద్ద ఉన్న అభయాంజనేయస్వామి 6వ వార్షిక మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది.

# భక్తితో ప్రార్థిస్తే పరమాత్మ అనుగ్రహం

**పెనుగొండ పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి (బాల స్వామీజీ)**

**తెనాలి:** ప్రజలందరూ భగవత్ ధ్యానంలో తరిస్తూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలని పెనుకొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి (బాల స్వామీజీ) సూచించారు. ఆర్యవైశ్యుల దేవత శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మస్థలమైన పెనుగొండలోని అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ క్షేత్రానికి పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన ప్రజ్ఞానంద సరస్వతి (బాల స్వామీజీ) తొలిసారిగా శనివారం సాయంత్రం స్వస్థలమైన తెనాలికి వచ్చారు. శ్రీసాలిగ్రామ మఠం ఆధ్వర్యంలో గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలో గురుపాదుక పూజకు హాజరయ్యారు. అక్కడ భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణ చేశారు. భక్తిశ్రద్ధలతో పరమాత్ముడిని ప్రార్థిస్తే ఆయన అనుగ్రహం పొందుతారని చెప్పారు. స్థితప్రజ్ఞతతో మనసులో అలజడులు లేకుండా ప్రశాంత జీవితాన్ని కొనసాగించాలని చెప్పారు. ధర్మ పరిరక్షణ కోసం తాను 'వైదిక ధర్మం' చానల్‌తో ఆధ్యాత్మిక సేవ చేస్తున్నట్లు గుర్తుచేశారు. తొలుత సాయంత్రం 5 గంటల ప్రాంతంలో తెనాలి వచ్చిన బాలస్వామికి పట్టణ సరిహద్దులోని భారీ వినాయక విగ్రహం వద్ద సాలిగ్రామ మఠం బాధ్యులు, భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. వినాయకుడికి పూజల అనంతరం పట్టణంలో శోభాయాత్రను నిర్వహించారు. మార్కెట్ మీదుగా గాంధీచౌక్, గ్రంథాలయం రోడ్డులోంచి గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠం చేరుకున్నారు. అక్కడ పాదుక పూజలో పాల్గొన్నారు. సాలిగ్రామ మఠం చైర్మన్ నంబూరి వెంకట కృష్ణమూర్తి, కార్యదర్శి రావూరి సుబ్బారావు, సంయుక్త కార్యదర్శి ముద్దాభక్తుని రమణయ్య, కోశాధికారి గోపు రామకృష్ణ, కమిటీ సభ్యులు రాజేశ్వరరావు, పెనుగొండ వెంకటేశ్వరరావు, కోన నాగేశ్వరరావు, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.



భారీ వినాయకుడి విగ్రహం వద్ద స్వామీజీ, సాలిగ్రామ మఠం బాధ్యులు

## పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



శుభ్రం చేస్తున్న జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ. భార్గవ్ తేజ, అధికారులు

**లక్ష్మీపురం:** శనివారం 'స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర'లో భాగంగా జిల్లా కలెక్టరు కార్యాలయంలో జరిగిన కార్యక్రమాల్లో జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ. భార్గవ్ తేజ, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ఎస్‌కే ఖాజావలిలు పాల్గొన్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులతో కలిసి కలెక్టరేట్ ప్రాంగణంలో వ్యర్థాలను శుభ్రం చేశారు. పౌర సరఫరాల కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. పరిశుభ్రత కార్యక్రమాలను నిరంతరం పాటిస్తామని ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యాలయాలను, పరిసర ప్రాంగణాలను శుభ్రంగా ఉండేలా అధికారులు ప్రణాళిక ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కలెక్టరేట్ ఏవో పూర్ణ చంద్రరావు, మత్స్య శాఖ డీడీ గాలిదేముడు, డీపీఓ సాయికుమార్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవీందర్, జిల్లా భూగర్భ జలవనరుల శాఖ ఉప సంచాలకులు వందనం, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జీజీహెచ్‌లో లైంగిక వేధింపుల కలకలం

- బ్లడ్ బ్యాంక్‌లో అసభ్యకర ప్రవర్తన
- ఫిర్యాదు చేసిన విద్యార్థినులు

**గుంటూరు మెడికల్ :** గుంటూరు జీజీహెచ్ బ్లడ్ బ్యాంక్‌లో లైంగిక వేధింపులు జరుగుతున్నాయంటూ శనివారం పలువురు విద్యార్థినులు ఫిర్యాదు చేశారు. గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్‌కు లిఖిత పూర్వకంగా తమ కుటుంబ సభ్యులతో కలిసి ఫిర్యాదు చేశారు. బ్లడ్‌బ్యాంక్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు ల్యాబ్ టెక్నీషియన్‌పై ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు చదువుతున్న విద్యార్థినులు ఫిర్యాదు చేయడంతో సదరు సంఘటనపై విచారణ చేపట్టారు.

### రక్తనిధి కేంద్రంలో రాత్రివేళ ఇలా..

బ్లడ్‌బ్యాంక్‌లో రాత్రి సమయాల్లో అవసరం లేకపోయినా ఓ డాక్టర్ తిష్టవేసి తమతో అసభ్యకరంగా వ్యవహరిస్తున్నారని కొంత మంది సిబ్బంది ఆరోపిస్తున్నారు. అందుకు బ్లడ్‌బ్యాంక్‌లో చేతులు కోసుకున్న సంఘటన ఉదాహరణగా చెబుతున్నారు. రెండు నెలల క్రితం బ్లడ్ బ్యాంక్‌లో పనిచేస్తున్న సిబ్బందిలో ఇద్దరు ఓ డాక్టర్ తన వాడంటే, తన వాడంటూ చేతులు కోసుకున్న సంఘటన కలకలం రేకెత్తించింది. దీనిపై విచారించిన అధికారులు సదరు డాక్టర్‌పై ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. దీంతో అతని రాసలీలకు అడ్డు లేదని అంటున్నారు. ఇప్పుడు లైంగిక వేధింపుల సంఘటన వెలుగులోకి వచ్చింది. బ్లడ్‌బ్యాంక్‌లో మెడికల్ ఆఫీసర్ పర్యవేక్షణ చేయాల్సిన పనులన్నీ ఓ కాంట్రాక్ట్ ల్యాబ్ టెక్నీషియన్ అంతా తానే అన్నట్లుగా వ్యవహరిస్తుండటంతో అక్కడ పనిచేస్తున్న పలువురు సిబ్బంది సదరు ఉద్యోగిపై తీవ్రంగా ఆరోపణలు చేస్తున్నారు. సెలవులు మంజూరు చేయాలన్నా, తనకు నచ్చినట్లు ఉంటేనే మంజూరు చేస్తాడన్నారు. లేని పక్షంలో లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడని ఆరోపిస్తున్నారు.



గుంటూరు జీజీహెచ్‌లోని రక్తనిధి కేంద్రం

**విచారణకు కమిటీ ఏర్పాటు**

బ్లడ్‌బ్యాంక్‌లో అసభ్యకర ప్రవర్తన చేస్తున్నారని ల్యాబ్ టెక్నీషియన్‌పై ఐదుగురు విద్యార్థినులు, వారి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వి. సుందరాచారి తెలిపారు. విద్యార్థినుల ఫిర్యాదుపై తక్షణమే విచారణకు కమిటీని నియమించామన్నారు. సంఘటనపై బ్లడ్ బ్యాంక్‌లో డాక్టర్‌ను కూడా పిలిపించి విచారిస్తున్నట్లు వెల్లడించారు.



## నేత్ర పర్వంగా భావనాఋషి కల్యాణం

**మంగళగిరి టౌన్:** మంగళగిరిలోని నాంచారమ్మ చెరువు ప్రాంగణంలో శ్రీ భద్రావతి సమేత భావనాఋషి కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. మంగళగిరి పట్టణ పద్మశాలీయ బహుత్తమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కల్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. సాయంత్రం స్వామివార్ల పులి వాహనంపై గ్రామోత్సవం జరిగింది. కల్యాణాన్ని పురస్కరించుకుని రాజీవ్ సెంటర్‌లో పలు సాంస్కృతిక కార్యక్రమాలను సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

# నిఘాతం!

**గుంటూరు రీజినల్ విజిలెన్స్‌లో కీలక పోస్టులు ఖాళీ**

గుంటూరు రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (విజిలెన్స్)లో కీలక పోస్టులు భర్తీ కావడం లేదు. నెలలుగా ఖాళీగా ఉన్నాయి. ఈ విభాగ విస్తీర్ణ పరిధి కూడా మూడు జిల్లాలకు వ్యాపించడంతో ఉన్నవారిపైనే పనిభారం మరింతగా పడుతోంది. అరకొర సిబ్బందితో నామమాత్రంగా తనిఖీలు చేస్తున్నారు. మరోవైపు అక్రమార్కులు యథేచ్ఛగా తమ కార్యకలాపాలు సాగిస్తున్నారు.

- డీఎస్పీ, తహసీల్దార్ నియామకాలు పట్టని సర్కారు
- ఉమ్మడి జిల్లాలోని అక్రమార్కులపై కొరవడిన నిఘా
- తూతూమంత్రంగా కొనసాగుతున్న తనిఖీలు
- గత ప్రభుత్వంలో పూర్తిస్థాయి సిబ్బందితో పటిష్టంగా విభాగం



గుంటూరులోని విజిలెన్స్ కార్యాలయం

**నగరంపాలెం(గుంటూరు వెస్ట్):** 2024 ఎన్నికల ముందు పూర్తిస్థాయిలో ప్రభుత్వ శాఖల్లో సరిపడా అధికారులు ఉండగా.. కూటమి అధికారంలోకి వచ్చాక ప్రక్షాళన పేరుతో అడ్డగోలు బదిలీలు చేపట్టింది. సుమారు ఎనిమిది నెలలు గడిచినా నియామకాలు పూర్తిస్థాయిలో జరగలేదు. రాజధాని పరిధిలోని ఉమ్మడి జిల్లాలకు కీలకమైన ఈ విభాగంలో ఖాళీలపై పలుమార్లు ఆ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి కింది స్థాయి యంత్రాంగం తీసుకెళ్లినా ఫలితం మాత్రం లేదు. గుంటూరు నగరంపాలెం జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో గుంటూరు రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (విజిలెన్స్) ఉంది. గత ప్రభుత్వ హయాంలో జిల్లాల పునర్విభజన జరిగింది. ఈ విభాగం పరిధి గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు విస్తరించింది. ఇందులో పోలీస్, రెవెన్యూ, మైనింగ్, వాణిజ్య పన్నులు, వ్యవసాయం, మండల పరిషత్, ఇంజినీరింగ్, అటవీ శాఖ అంతర్భాగంగా ఉన్నాయి. ఆయా శాఖల నుంచి డీఎస్పీ, ఎస్ఐ, తహసీల్దార్, మండల పరిషత్ అధికారి, డీసీటీవోతోపాటు ఉన్నతస్థాయి అధికారులు విధుల్లో ఉంటారు. హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, పలువురు సిబ్బంది కొనసాగుతున్నారు. రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగపు అధికారి (విజిలెన్స్ ఎస్పీ) పర్యవేక్షణలో వీరు విధులు నిర్వహిస్తారు. విజిలెన్స్ ఎస్పీగా పోలీసు శాఖ ఉన్నతాధికారి ఉంటారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వర్తించేవారు. ప్రజా పంపిణీ బియ్యం అక్రమ రవాణా, నిషేధిత సిగరెట్లు, నకిలీ, కల్తీ ఎరువులు, పురుగుల మందులు, నిత్యావసర సరకులు వంటివి నిల్వ చేసి అధిక ధరలకు విక్రయించే వ్యాపారాలు తదితరాల విషయంలో సోదాలు చేసేవారు. అక్రమార్కులపై కేసులు నమోదయ్యాయి. ఒక్కోసారి రైతుల వేషధారణలో దుకాణాలకు వెళ్లి కేసులు నమోదు చేసిన రోజులు ఉన్నాయి.

### తనిఖీల ఊసే కరవు

పూర్తిస్థాయి సిబ్బంది లేక ఒక్కొక్కసారి గుంటూరు, బాపట్ల జిల్లాలకు ఒక బృందం, పల్నాడు జిల్లాకు మరో బృందంగా వెళ్లి తనిఖీలు చేయాల్సి వస్తోంది. ఈ ఎనిమిది నెలల్లో కూడా చెప్పుకోదగ్గ తనిఖీల్లేవు. పీడీఎస్ బియ్యంపై దఫాల వారీగా కేసులు నమోదు చేశారు. స్థానిక నేతల కనుసన్నల్లో ఈ వ్యవహారం కొనసాగుతుండటంతో అదీ మొక్కుబడిగా చేశారనే వాదన లేకపోలేదు. మిర్చి యార్డు, మైనింగ్, ఇసుక రీచ్‌లపై మరింత లోతుగా విచారణ చేస్తున్నట్లు ప్రస్తుత అధికారులు చెబుతున్నారు.

### ప్రక్షాళన పేరుతో అసలుకే ఎసరు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రక్షాళన పేరుతో ఈ విభాగంపై కన్నేశారు. విజిలెన్స్ ఎస్పీ మొదలు ఇతర ప్రధాన అధికారులను వెంటనే బదిలీ చేశారు. కూటమి ప్రభుత్వ అండదండలున్న కొందరు బదిలీపై వచ్చేశారు. పోలీస్ శాఖ నుంచి ఇద్దరు సీఐలు విధుల్లో చేరారు. మండల పరిషత్ నుంచి ఎంపీడీవో పోస్ట్ ఖాళీగా ఉంది. వాణిజ్య పన్నుల శాఖ నుంచి డీసీటీవో లేదా ఏసీటీవోలను నియమించలేదు. పోలీస్ శాఖ నుంచి గతంలో డీఎస్పీగా ఉన్న శ్రీనివాసరావు బదిలీ అయ్యాక ఇప్పటి వరకు పోస్టు ఖాళీగా ఉంది. ఎన్నికల తర్వాత ఎస్ఐ రామచంద్రారెడ్డిని ఇంటెలిజెన్స్‌కు బదిలీ చేశారు. ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు (హెచ్‌సీ), సుమారు ఎనిమిది మంది కానిస్టేబుళ్ల పోస్టులు భర్తీ కాలేదు. కీలకమైన తహసీల్దార్ పోస్ట్ ఖాళీగా ఉంది. గతంలో ఆ విధులు నిర్వర్తించిన నాగమల్లేశ్వరరావు కృష్ణా జిల్లా అవనిగడ్డకు బదిలీ అయ్యారు. సూపరింటెండెంట్ పోస్ట్ కూడా నెలలుగా ఖాళీగా ఉంది.

- రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

చీరాల రూరల్: గూడ్స్ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం రాత్రి చీరాల రైల్వే స్టేషన్ వద్ద చోటు చేసుకుంది. జీఆర్పీ ఎస్ఐ సీహెచ్. కొండయ్య తెలిపిన వివరాలు.. మృతుని వయస్సు సుమారు 55 ఏళ్లు ఉండవచ్చునని తెలిపారు.



# పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

## జిల్లా నీటియాజమాన్య సంస్థ పీడీ వడ్డే శంకర్



వేజెండ్లలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న పీడీ వడ్డే శంకర్

**చేబ్రోలు:** పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, మన ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచుకోగలిగితే బిడ్డలకు మంచి భవిష్యత్తు ఉంటుందని, ఎటువంటి కాలుష్యం లేని ఆహారం, గాలి, మంచి నీటిని అందించగలుగుతామని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరక్టర్ వడ్డే శంకర్ అన్నారు. చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామంలో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరిగింది. వేజెండ్ల గ్రామంలోని హౌసింగ్ లేఅవుట్ -1 లో జరిగిన కార్యక్రమంలో సోక్ పిట్ కొలతలు, నిర్మాణ పనివిధానాన్ని వడ్డే శంకర్ పరిశీలించి అవగాహన కల్పించారు. గ్రామంలో మంజూరైన 62 సోక్ పిట్లను వేగవంతంగా పూర్తి చేయాలని ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందికి, మండల, గ్రామ అధికారులకు సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. చెత్తబుట్టలపై ఎంపీడీఓ ఎ. ఉమాదేవి అవగాహన కల్పించారు. ఈవోపీఆర్డీ టి.ఉషారాణి, పంచాయతీ కార్యదర్శి వేణుగోపాలరావు, ఓబుల్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# వృద్ధురాలిపై లైంగికదాడి, హత్య కేసులో నిందితులు అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ప్రత్తిపాడు సీఐ శ్రీనివాసరావు, పక్కన ఎస్ఐ మధు పవన్

**కాకుమాను:** ఇటీవల పెదనందిపాడు శివారులోని పూరి గుడిసెలో నివసిస్తున్న వృద్ధురాలిపై లైంగికదాడి చేసి హత్య చేసిన కేసులో నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ప్రత్తిపాడు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. పెదనందిపాడు పోలీసు స్టేషన్‌లో శనివారం సీఐ శ్రీనివాసరావు కేసు వివరాలను వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 2వ తేదీన పెదనందిపాడు శివారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో పూరి గుడిసెలో నివశిస్తున్న వృద్ధురాలు(64)పై అదే ప్రాంతానికి చెందిన పాత నేరస్థులైన పాలపర్తి మంజు, పాలపర్తి సాంబ అనే ఇద్దరు యువకులు లైంగికదాడి చేసి హత్య చేసినట్లు ఆయన తెలిపారు. మృతురాలి కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సిబ్బంది మూడు బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టినట్లు ఆయన తెలిపారు. నిందితుల కోసం పేరేచర్ల, అనకాపల్లి, హైదరాబాద్, విశాఖపట్నంలలో గాలింపు చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈక్రమంలో శుక్రవారం పెదనందిపాడు పరిసర ప్రాంతాల్లో నిందితులు ఉన్నారనే సమాచారంతో అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. సిబ్బందిని ఎస్పీ అభినందించారన్నారు. పెదనందిపాడు ఎస్ఐ మధు పవన్, సిబ్బంది పాల్గొన్నారు.

# యువకుడిపై దాడి.. హత్యాయత్నం

- తీవ్రంగా కొట్టి, రైలు పట్టాలపై పడేసేందుకు తీసుకెళుతున్న నిందితులు
- అనుమానాస్పదంగా ఉన్న వాహనాన్ని అడ్డుకున్న రాత్రి గస్తీ పోలీసులు

**తెనాలిరూరల్:** యువకుడిపై దాడి చేయడమే కాకుండా రైలు పట్టాలపై పడేసి హతమార్చేందుకు ముగ్గురు యువకులు యత్నించారు. యువకుడిని కారులో తీసుకెళుతుండగా వారి వాహనాన్ని పోలీసులు ఆపడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. అత్యంత విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి... పట్టణంలోని నందులపేటకు చెందిన యువకుడు మణి హైదరాబాద్‌లో వ్యభిచార గృహం నడిపేవాడు. అక్కడి పోలీసులకు విషయం తెలిసి దాడులు నిర్వహించగా తెనాలికి తిరిగి వచ్చేశాడు. హైదరాబాద్‌లో ఇతని వద్ద కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన సతీష్ పని చేశాడు. కొన్ని నెలల జీతం బకాయి ఉంది. తరచూ మణికి ఫోన్ చేసి బకాయి గురించి అడుగుతుండడంతో సతీష్‌ను శుక్రవారం సాయంత్రం విజయవాడకు రమ్మని చెప్పాడు. తన ఇద్దరు స్నేహితులతో కలసి కారులో విజయవాడ వెళ్లిన మణి, సతీష్‌ను కారులో ఎక్కించుకుని దాడికి పాల్పడి తీవ్రంగా గాయపర్చారు. అదే కారులో రాత్రికి తెనాలికి తీసుకువచ్చి ఇక్కడి సుల్తానాబాద్‌లోని నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి మరోసారి తీవ్రంగా దాడి చేశారు. రైలు పట్టాలపై పడేసి చంపేస్తామని చెప్పి అర్ధరాత్రి దాటాక కారులో తీసుకెళుతుండగా రాత్రి గస్తీ పోలీసులు అనుమానాస్పదంగా తిరుగుతున్న వాహనాన్ని నిలిపి ప్రశ్నించడంతో విషయం తెలుసుకుని బాధితుడు సతీష్‌ను వైద్యశాలకు పంపి చికిత్స అందించారు. ముగ్గురు నిందితులను విచారిస్తున్నారు.